
ప్రజాశక్తి
ఆదివారం 27 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం



పిఎం స్వనిధి అమలులో అవార్డు

ప్రజాశక్తి - సాలూరు

ప్రధానమంత్రి స్వనిధి అమలులో రాష్ట్రం లోని మున్సిపాలిటీల్లో సాలూరు రెండో స్థానంలో నిలిచినందుకు అవార్డు లభించింది. ఈమేరకు ఈనెల 29న విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డును మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అందుకోనున్నారు. పిఎం స్వనిధి కింద స్వయం ఉపాధి కల్పన కోసం రుణాలు పంపిణీలో మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచింది. ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన మెప్మా సిఎంఎం ఎ.పుష్ప, సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేద్దాం

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి, పక్కన కలెక్టర్ జెసి, ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్దామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శాఖలవారీగా ఆమె సమీక్షించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, సాగునీరు వంటి పలు అంశాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. గత రెండేళ్లుగా జిల్లాలో 10వ తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది కూడా అదేబాటలో నడవాలని ఆమె ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో జిల్లాలో 129 పాఠశాలలు మూతపడ్డాయని, వాటిపై సమగ్రమైన సర్వేచేసి అవసరమైన వాటిని పున: ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించాలని 'ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో పాఠశాలలను తెరవేందుకు కృషి చేస్తామన్నారు. జిసిసి ద్వారా నేరుగా విద్యార్థులకు కాస్మోటిక్స్ సామాగ్రిని స్వయంగా అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల దుస్తులకు ఉతికేందుకు ప్రతీ పాఠశాలలో ఒక దోభీని ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. వసతి గృహ విద్యార్థులకు రూ. 10కోట్లతో బెడ్ షీట్, దుప్పటి, కంచం, గిన్నె, ట్రంక్ పెట్టె మొదలైన వాటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. నవంబర్ 14న ప్రతి పాఠశాలలో పండగ వాతావరణంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతీ 10 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్ వుండాలని, వాటిని దృష్టిలో ఉంచుకోని టాయిలెట్లు లేని పాఠశాలలను గుర్తించి నిర్మించాలని అన్నారు.

గిరిజన ప్రాంతాల్లోని ప్రతి ప్రాథమిక ఆరోగ్యా కేంద్రానికి తప్పనిసరిగా వైద్యులు ఉండాలని, లేనిలోట వైద్యులను సర్దుబాటు చేయాలని కలెక్టరును ఆమె కోరారు. రోగులు బయట మందులు కొనుగోలు చేయరాదని వైద్యులకు ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అవసరమైన ఎస్.సి.ఎం ఇంజక్షన్ అందుబాటులో ఉంచుకోవాలని, వాటికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజురుచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను కోరడం జరిగిందని, త్వరలో మంజూరు కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాలోని ప్రతీ గ్రామంలో తాగునీటిని అందించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికి 85శాతం పూర్తిగాను, 5శాతం పాక్షికంగానూ గ్రామాల్లో తాగునీటిని అందిస్తున్నారని, మిగిలిన 10 శాతం రామన్న 30రోజుల్లో పూర్తిచేయాలని అదేశించారు. జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో పంట భూములుండగా, వాటిలో 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. తోటపల్లి జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా కురుపాం నియోజకవర్గంలోనిభూములకు సాగునీటిని అందిచేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. జైకా నిధులతో గతంలో పనులు ప్రారంభించి నిలిచిపోయిన పనులను మళ్లీ ప్రారంభించాలని, దీనిపై చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 2,748 గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని, తొలిదశలో 549 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామసభల్లో తీర్మానించిన అన్ని పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని అన్నారు. కుంకీ ఏనుగులతో గ్రామాల్లోని ఏనుగుల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతి పంచాయతీలో బాల విహార్, యువ కేంద్రాలు చేపట్టాలని అన్నారు.

జిల్లాలోని 2,064 అంగన్వాడీ కేంద్రాలకు గాను 469 కేంద్రాల్లో మరుగుదొడ్ల సదుపాయం లేదని, వాటికి టాయిలెట్స్ సదుపాయం, నీటి సదుపాయం కల్పించాలన్నారు. సొంత అంగన్వాడీ భవన నిర్మాణాల కోసం 5 సెంట్ల స్థలాన్ని విఆర్ఒ ద్వారా సేకరించాలని డిఆర్ఒను ఆదేశించారు. అన్నా క్యాంటీన్లు ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని, సీతంపేట ఐటిడిఎ ఎదురుగా ఒక అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్నా క్యాంటీన్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సమకూర్చాలన్నారు. డ్రోన్ సహాయంతో రహదారులు, ఆసుపత్రులు, భారీ వర్షాల సమయంలో జరిగిన నష్టాలను గుర్తించి , వాటికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను కోరారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆమె కోరారు.

తొలుత జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రగతిని, చేపట్టబోయే కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. సమావేశంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సుందర పార్వతీపురం ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించిన మంత్రి

స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సుందర పార్వతీపురం ఆర్ట్ గ్యాలరీని మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. సుందర పార్వతీపురం రూపొందాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వామ్యమై జిల్లా వ్యాప్తంగా పరిశుద్ధ వాతావరణం ఏర్పాటు చేయడంతో పాటు సుందరమైన ప్రకతి సోయగల పరిసరాలను రూపకల్పనకు సహకరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

డిసెంబర్ 10, 11 తేదీల్లో

సిపిఎం జిల్లా మహాసభ

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ
- 8 నుంచి 14 వరకు ప్రజా సమస్యలపై ప్రచార హోరు
- 15న కలెక్టరేట్ వద్ద ధర్నా : జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం 10 వ జిల్లా మహాసభలు డిసెంబర్ 10, 11 తేదీలలో కురుపాంలో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బరావమ్మ తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా విస్తతస్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ గత మూడేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన రాజకీయ విధానాలను సమీక్షించుకొని దాని ఆధారంగా పార్టీ ఎత్తుగడలను, లోపాలను, నిర్మాణ అంశాలపై చర్చించి భవిష్యత్తు రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళిక, కర్తవ్యాలను రూపొందించేందుకు ఈ మహాసభలు జరుపుతున్నామని అన్నారు. గత తొమ్మిదవ జిల్లా మహాసభ పార్వతీపురం కేంద్రంలో జరిగిందని, అలాగే కురుపాంలో జరిగే 10వ జిల్లా మహాసభలను ప్రాథమిక శాఖ కమిటీల నుండి మండల, జిల్లా కమిటీల వరకు కృషి చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలు జయప్రదం కొరకు కార్మికులు, రైతులు, ప్రజలు, మేధావులు ఆర్థిక హార్థిక సహకారాలతో జయప్రదం చేయాలని కోరారు.

అనంతరం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, ఆర్థిక విధానాలను ఖండిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 8 నుండి 14 వరకు ప్రజా సమస్యలపై ప్రచార హోరు కార్యక్రమాలు చేపడుతున్నామని, 15న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నా కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు, కె.అవినాష్, వి.ఇందిర, కె.గంగునాయుడు, జిల్లా నాయకులు ఎన్ వై నాయుడు, ఎం శ్రీనివాసరావు, జి.వెంకట రమణ, బంటు దాసు, కె.రామస్వామి, ఎ.భాస్కర రావు, సింహాచలం, బివి రమణ, కొల్లి సాంబమూర్తి, రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి

6న చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 30 వరకు మండలాల్లో ధర్నాలు, నవంబర్ 2 నుంచి 4 వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు, 6న చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చామన్నారు. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లు విద్యా, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలి, డిగ్రీలో మేజర్, మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పార్వతీపురం మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ల, ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న హాస్టళ్ల వార్డెన్లు, వర్కర్లను వెంటనే నియమించాలి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, బీసీ, పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో అదనపు భవనాల నిర్మించాలని చేపడుతున్న ఈ ఆందోళనలో విద్యార్థులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రాజశేఖర్, జిల్లా కోశాధికారి టి.అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో ఏజెన్సీలో సత్వర సేవలు

- మార్చి కల్లా సాలూరు వంద పడకల ఆసుపత్రి సిద్ధం
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి డ్రోన్ టెక్నాలజీతో చర్యలు తీసుకోనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీలో విద్యుత్ స్తంభాలు పడిపోవడం, ఇతర సంఘటనలు జరిగినప్పుడు అధికారులు తెలుసుకోవడానికి చాలా సమయం పడుతోందని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీతో అయితే సమస్య ఎక్కడ వుందో తెలుసుకుని పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకునేందుకు వీలుగా వుంటుందని అన్నారు. మన్యం జిల్లాలోనే మొదటిగా ఈ టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో క్రీడా మైదానాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.170కోట్లతో, పిఎం జన్ మాన్ కింద రూ.35 కోట్లతో, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. కేంద్రం నుంచి ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పనులకు మరో రూ.150 కోట్లు మంజూరయ్యాయని, తొమ్మిది ఐటిడిఎలకు ఈ నిధుల కేటాయింపు జరుగుతుందని అన్నారు. జిల్లాలోని2064 అంగన్వాడీ కేంద్రాల్లో 469 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మార్చి కల్లా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం

వచ్చే ఏడాది మార్చి నాటికి సాలూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో ఆసుపత్రి నిర్మాణానికి సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ఆగిపోయాయని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఆసుపత్రి నిర్మాణం త్వరగా చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు సంకల్పించి రూ.4కోట్లు మంజూరు చేశారని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. కురుపాంలో ఆసుపత్రి నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని పిహెచ్‌సి ల్లో డాక్టర్లు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గిరిజన ప్రాంతంలో రక్తం గడ్డకట్టడం వల్ల ఎక్కువగా గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారని, దీని నివారణకు ఎస్టీ ఎం ఇంజెక్షన్లను జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.

చిన్న జిల్లా.. చింతలేని జిల్లా

మన్యం జిల్లా చిన్న జిల్లా, చింత లేని జిల్లా అని మంత్రి సంధ్యారాణి చెప్పారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి మన్యం తొలగించాలని చాలా ఫిర్యాదు లొచ్చినట్లు సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారని తెలిపారు.అరుకు పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక జిల్లా చేయాలని మొదట సంకల్పించారని, అప్పుడు తాను వ్యతిరేకించానని చెప్పారు. జిల్లాలో ప్రజాసమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. గ్రీవెన్స్ సెల్‌లో అందుతున్న పిర్యాదులపై వెంటనే అధికారులు స్పందించడం అభినందనీయమన్నారు. శుక్రవారం జరిగిన జెడ్పీ సమావేశంలో కూడా జిల్లా కి సంబంధించి సమస్యలేవీ ప్రస్తావన కు రాలేదని మంత్రి సంధ్యారాణి చెప్పారు.

3న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొండ

నవంబర్ 3న జరగనున్న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మురళీమోహనరావు కోరారు. మండలంలోని స్థానిక బాలికోన్నత పాఠశాల, వెంకమ్మపేట, గరుగుబిల్లి, లుంబూరు, గుడివాడ, కోటిపల్లి, ఎల్.ఎల్.పురం, వి.పి.రాజుపేట, పాలకొండ హడ్కో కోలనీ, బాసూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, వోని తదితర పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయులను కలిసి అనేక అంశాలను చర్చించారు. ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకుంటూ, సందేహాలను నివృత్తి చేస్తూ పర్యటించారు. ఇందులో భాగంగా ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఇటీవల యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులకు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో చదరంగం, షటిల్, క్రికెట్, మ్యూజికల్ చైర్, కబడి, పాటలు, కవితలు, ఏకపాత్రాభినయం తదితర పోటీలు నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాలనేవి సామాజిక బాధ్యతను సూచిస్తున్నాయనే సందేశాన్ని చాటిచెప్పామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, పాలకొండ మండల శాఖ అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, వీరఘట్టం మండల ప్రధాన కార్యదర్శి కె.గోవిందరావు, సీతంపేట మండల కోశాధికారి ఎస్.గణేష్, కొత్తూరు మండల కార్యవర్గ సభ్యులు కుదమ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

28న సీతంపేటలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సీతంపేటలో సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. సీతంపేట ఐటిడిఏ ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమ ఆర్జీలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించవచ్చని ఆయన అన్నారు. జిల్లా అధికారులు అందరూ పిజిఆర్ఎస్ కు సీతంపేటలో హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

క్రీడా సముదాయానికి 10 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలో క్రీడా సముదాయం ఏర్పాటుకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండలంలోని జోగింపేట వద్ద 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు ఈ స్థలాన్ని క్రీడా ప్రాధికార సంస్థకు శనివారం అప్పగించారు. క్రీడా సముదాయం ఏర్పాటుకు స్థలం కేటాయించిన జిల్లా కలెక్టర్ కు జిల్లా క్రీడల అభివద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గాంధీ, తదితరులు అభినందనలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

28న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 28న మున్సిపల్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం, బెలగాంలో గల రెండో మస్తర్ పాయింట్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలపై పోరాడాలన్నారు. కార్మికులపై రోజురోజుకు పనిభారం పెరుగుతుందని, దొడ్డిదారిన అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పని చేయించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల నుంచి సంతకాల సేకరణ, మస్తర్ పాయింట్ల వద్ద ధర్నాలు నిర్వహించామన్నారు. ఆదివారం ఎమ్మెల్యే /ఛైర్‌పర్సన్‌ల వద్ద సామాజిక రాయబారాలు, 28న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతూ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. కావున ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఈనెల 28న జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సిహెచ్ సంజీవ్ పిలుపునిచ్చారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు సంబంధించిన కపత్రాలను స్థానిక నగర పంచాయతీ ఆవరణలో విడుదల చేశారు. ఈ ఆందోళనలో భాగంగా ఆదివారం కమిషనర్లు, ఛైర్మన్లు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని, సోమవారం మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని కార్మికులను కోరారు.



మస్తర్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు


ఏనుగుల సంచారం పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో రెండు ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయని జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలం దిబగుడివలసలో 7 ఏనుగులతో కూడిన ఒక గుంపు, భామిని మండలం జామిగూడ సమీపంలో 4 ఏనుగులతో కూడిన మరో గుంపు సంచరిస్తున్నాయన్నారు. ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఇచ్చిన సూచనలను ఖచ్చితంగా పాటించాలని ఆమె అభ్యర్థించారు. అడవి ఏనుగులు రోజులో ఎక్కడైనా సంచరించే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో మంద ఉన్నప్పుడు గ్రామస్తులు వ్యవసాయ పొలాలకు వెళ్లొద్దని సూచించారు. గ్రామపెద్దలు, సర్పంచ్, సచివాలయం ఉద్యోగులు, పోలీసు శాఖ ఇతర శాఖలు గ్రామస్థులకు అవగాహన కల్పించడంలో అటవీ శాఖకు సహాయం చేయాలని ఆమె కోరారు. ఏనుగులు ఈ ప్రాంతానికి అలవాటు పడ్డాయని, గత 5 నుండి ఆరేళ్లుగాఆయా ప్రాంతాల్లో ఉంటున్నాయని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. అలాగే ఇతర శాఖల అధికారులు సహకరించాని కోరారు.

వేధిస్తున్న ఏనుగుల సమస్య

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లాను ఏడేళ్లుగా వెంటాడుతున్న ఏనుగుల సమస్యకు పరిష్కారమెప్పుడో తెలియడంలేదు. క్రమేణా ఏనుగుల సంతానం వృద్ధి చెందుతున్నా, ఆస్తి, ప్రాణనష్టం పెరుగుతున్నా పాలకుల్లో మాత్రం చలనం లేదు. ఏనుగుల దాడుల్లో ఇంకెంతమంది మరణించాలని జనం ప్రశ్నిస్తున్నారు. 2017 నుంచి మొదలైన ఏనుగుల బెడద రానురాను ముప్పుగా పరిణమిస్తోంది. ఎప్పుడు ఎటువైపు నుంచి ఏనుగులు తరుముకొస్తాయోనని ఏజెన్సీ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కళ్ల ముందే పండించిన పంటలు నాశనమవుతున్నా చేసేది లేక మౌనం వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి ఏనుగుల బెడద ప్రారంభమైంది. ఇప్పుడు మన్యం జిల్లా వాసుల్ని వణికిస్తోంది. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తున్నారు. ఏడేళ్ల క్రితం ఒడిశా నుంచి శ్రీకాకుళం జిల్లా మీదుగా కురుపాంలో ప్రవేశించిన ఏనుగులు ఇంతింతై అన్నట్టుగా వృద్ధి చెందుతున్నాయి. ఆరుగాలం శ్రమించి గిరిజనులు పండించిన పంటలను, తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ఆస్తినష్టం జరిగినప్పుడల్లా బాధిత ప్రజలు అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడమే కనిపిస్తోంది. కానీ జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించే దిశగా గత ప్రభుత్వం హయాంలోనూ అడుగులు పడలేదు. నాలుగు నెలలు క్రితం అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఆ ప్రయత్నాలు చేయడం లేదు. జిల్లాలో ఇంతవరకు 13మంది ఏనుగుల దాడుల్లో మృత్యువాత పడ్డారు. సుమారు రూ.6కోట్ల మేర ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. గురువారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లికి చెందిన వి.యాకోబ్ ఏనుగుల దాడిలో మరణించారు. ఆస్తి, ప్రాణనష్టంతో పాటు జిల్లాలో ఇంతవరకు ఏడు ఏనుగులు అనేక కారణాల రీత్యా మృతి చెందాయి.

ప్రభుత్వమే సమస్యకి పరిష్కారం చూపాలి

ఏడేళ్లుగా జిల్లాను వేధిస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కారం ప్రభుత్వ స్థాయిలో కనుగొనాలి. అంతే కానీ జిల్లా అధికారుల స్థాయిలో చేయాల్సిన పని కాదు. ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం పరిష్కారానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వమే మార్గం కనుక్కోవాల్సి వుంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏనుగుల బెడదకు ముగింపు పలికే ప్రయత్నం చేసిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించింది. అయితే అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను మచ్చిక చేసుకొనే కుంకీ జాతి ఏనుగులను కర్ణాటక నుంచి తీసుకొచ్చి సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వ పెద్దలు మొదట్లో చెప్పారు. అయితే ఆ దిశగా పాలకులు అడుగులు వేయడం లేదు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేని సమస్య మన్యం జిల్లాను వెంటాడుతోంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడం, ఏజెన్సీ ప్రాంతమవ్వడంతో రాష్ట్రంనే అత్యంత వెనుకబడిన జిల్లాగా గుర్తింపు పొందింది. ఇలాంటి జిల్లాపై మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఏనుగుల బెడద ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించింది. ప్రస్తుత ప్రభుత్వం ముందు ఏనుగుల సమస్య పరిష్కారానికి రెండే మార్గాలు వున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. కుంకీ ఏనుగులను తీసుకొచ్చి జిల్లాలో ఉన్న ఏనుగులను తరలించడం ఒక మార్గ మైతే జిల్లాలోనే ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం మరో మార్గంగా కనిపిస్తోంది. ఈ రెండు పరిష్కారమార్గాలు కూడా ప్రభుత్వానికి వ్యయప్రయాసలతో కూడిన చర్యలైనా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే ఏదో ఒక చర్యకు అడుగు ముందుకు వేయాల్సిన అవసరం ఉంది.

స్క్రీనింగ్ పరీక్షలతో కేన్సర్ గుర్తింపు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామాల్లో స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించడం వల్ల కేన్సర్ రోగులను గుర్తించి వారికి తగు చికిత్స అందించే అవకాశం ఉందని హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నరేంద్ర అన్నారు. శనివారం పార్వతీపురం మండలం నవిరి కాలనీలో ఐఆర్‌డిబ్ల్యుఎ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌సిజి హాస్పిటల్ ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ ఈ స్క్రీనింగ్ టెస్ట్ వల్ల ముందుగానే కేన్సర్‌ను గుర్తించడం జరుగుతుందని, కేన్సర్‌ను నివారించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని, హెచ్‌సిజిలో అన్ని రకాల కేన్సర్లకు ప్రభుత్వ, ప్రైవేటు హెల్త్ కార్డులపై ఉచితంగా వైద్యం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సిజి హాస్పిటల్ సిబ్బంది ఎల్.సురేష్, ఐఆర్‌డిబ్ల్యుఎ సిబ్బంది సత్యనారాయణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి దర్యాప్తు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ఈనెల 21న జరిగిన ఘర్షణలో నమోదైన అట్రాసిటీ కేసుపై పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు శనివారం దర్యాప్తు చేపట్టారు. గడసింగుపురానికి చెందిన గురుగుబిల్లి ఎలిషా, చింతాడ మధు, నాగళ్ల బుజ్జి తదితరులను జియ్యమ్మవలసకు మణిభూషణ్ మధ్య తగాదా జరిగింది. వీరిని నివారించేందుకు వచ్చిన దత్తి చంద్రమౌళి, దత్తి సతీష్ ఎలిషాను కులం పేరుతో తిట్టారనిపోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మణిభూషణ్, ఎలీషా మధ్య గొడవను నివారించేందుకు వెళ్లిన తన తండ్రి దత్తి చంద్రమౌళి, అన్నయ్య దత్తి సతీష్‌పై చేయి చేసుకున్నారంటూ దత్తి చంద్రమౌళి కుమార్తె దత్తి సంతోషి కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులులేకుండా దీపావళి మందుగుండు సామాగ్రి అమ్మినట్లు చర్యలు తీసుకుంటామని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు హెచ్చరించారు. దీపావళి సందర్భంగా గ్రామాల్లో కిరాణా షాపుల్లో మందుగుండు సామాగ్రి అమ్మొద్దని, ఒకవేళ అమ్మాలనుకుంటే అనుమతులు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) టెస్ట్ కోసం చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో సమాజ్ పరివర్తన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సమాజ్ పరివర్తన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నరేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్యంలోనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, దానికి అనుగుణంగా ఒక ప్రణాళిక ప్రకారం చదవాలని అన్నారు. ఈ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించేలా కృషి చేయాలని కోరారు. ఈ మెటీరియల్‌ను సక్రమంగా వినియోగించి ఎక్కువమంది ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు వై.హేమసుందర్ కోరారు. కార్యక్రమంలో సమాజ్ పరివర్తన్ స్టీరింగ్ కమిటీ మెంబర్ బి.చంద్రరావు, కో-ఆర్డినేటర్ ఎస్. హిమగిరి, ఉపాధ్యాయ సిబ్బంది ఎం.నాగేశ్వరరావు, పి. సింహాచలం, అభిమన్యు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రకృతి సేద్య కూరగాయలు అవసరం

ప్రజాశక్తి - పాచిపెంట

ఆరోగ్యంగా ఉండాలంటే రసాయనాలేని ఆహార ఉత్పత్తులు అవసరమని, ప్రతి పాఠశాలలో పెరటి కూరగాయల తోటలు ఉండాలని, ఇవి రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయని ఎపిసిఐ జనార్ధన్ పాత్రో అన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావుతో కలిసి స్థానిక హైస్కూల్లో కూరగాయల విత్తనాలు నాటారు. అనంతరం తెల్లడువలసలో రైతు నరసింహరావు 20 సెంట్లు మడిలో ఏటిఎం మోడల్ పద్ధతిలో ప్రకృతి సేద్య కూరగాయలు వేశారు ఈ పద్ధతిలో స్థిరమైన ఆదాయం వచ్చేలా కాయగూరలు, దుంప జాతి కూరలు, తీగ జాతి కూరలు వేసుకోవాలని, తక్కువ భూమిలో ఎక్కువ రకాలు వేసి సాంద్ర పద్ధతిలో పండించినప్పుడు ఎక్కువ దిగుబడి వస్తుందని ఎఒ తెలిపారు. ఆరోగ్యవంతమైన పంటలకు ఏటిఎం మోడల్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.

హామీలు అమలు చేయాలని తీర్మానం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని జిల్లేడువలస, బొర్ర పనుకువలస గిరిజనులకు పట్టాలు ఇస్తామని అధికారులు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎం శాఖా మహాసభలో తీర్మానించారు. సిపిఎం నాయకులు బర్ల అప్పారావు జెండా ఆవిష్కరణతో శాఖా మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గతంలో పట్టాలు ఇవ్వాలని జిల్లేడు వలస, బొర్ర పనుకువలస గ్రామాల గిరిజనులు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నా సమస్య పరిష్కారం చేయడం లేదని తెలిపారు. గతంలో జిల్లాలో అనేక ప్రాంతాల్లో పట్టాలు ఇస్తామని సర్వేలు చేసి నేటికీ పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అధికారులు స్పందించి బొర్ర పనుకోవలస, జిల్లేడువలస గ్రామాల గిరిజనులకు పట్టాల పంపిణీకి చొరవ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుక్కా గంగరాజు, అడ్డాకుల బంగారయ్య, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జంఝావతి కాలువపై వివిధ రకాల పంటలు

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి కాలువపై వివిధ రకాల పంటలు వేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండలంలోని ఆర్తాంలో జంఝావతి కాలువపై వేసిన వివిధ రకాల పంటలను శనివారం ఆయన పరిశీలించారు. జంఝావతి ప్రధాన కాలువపై వివిధ రకాల పంటలు ఉన్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఆక్రమణకు గురవుతుందన్నారు. మండలంలోని రాజ్యలక్ష్మి పురం నుండి గరుగుబిల్లి మండలంలో కొన్ని గ్రామాల వరకు ఉన్న ప్రధాన కాలువ మొత్తం ఆక్రమణకు గురవుతుందన్నారు. ప్రధాన కాలువను కొంతమంది అక్రమంగా పంటలు వేసుకొని ఆక్రమణకు గురవుతుంటే ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కావున వీటిపై ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి శివున్నాయుడు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం : డిడి

ప్రజాశక్తి - సీతంపేట

మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ట్రైబల్ వెల్ఫేర్ డిడి అన్నదొర అన్నారు. శనివారం ఆయన పూతికవలస ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. ఆర్వో ప్లాంట్‌ను, స్టోర్ రూం రికార్డులను తనిఖీ చేశారు. నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం, శారద ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

కాశీపట్నంలో గ్రామసభ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నంలో శనివారం గ్రామసభ నిర్వహించినట్లు ఎపిఒ ఈశ్వరమ్మ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 63 పనులకు సంబంధించి చర్చించారు. జరిగిన పనులపై విచారణ కూడా చేపట్టాలన్నారు. డిఆర్‌పి వరాహమూర్తి సమక్షంలో ఈ సామాజిక తనిఖీ గ్రామ సభ విషయాలన్నీ సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ఈ గ్రామ సభకు సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి -వీరఘట్టం

సచివాలయాల ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామస్తుల నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పరిష్కార, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఈవో ఎం రవి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతినెలా 1 నుంచి రేషన్ పంపిణీ

ప్రజాశక్తి -భామిని

ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఎండియు ఆపరేటర్లు రేషన్ సరుకులు పంపిణీ చేపట్టాలని తహశీల్దార్ అప్పారావు తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లకు, ఎండియూ ఆపరేటర్‌కు సమావేశం నిర్వహించారు. రేషన్ సరుకులు సక్రమంగా పంపిణి చేయాలనీ, తూనికలో తేడాలు లేకుండా చూడాలని, ఎండియు ఆపరేటర్, డీలర్లు సమన్వయంతో రేషన్ పంపిణీ చేపట్టాలని తహశీల్దార్ తెలిపారు.

చట్టబద్ధంగా ఉపాధి పనులు నిర్వహించాలి

వెండర్ల దోపిడీ విధానానికి స్వస్తి పలకాలి : సర్పంచుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

అన్ని రకాల ఉపాధి హామీ పనులు సర్పంచ్ ఆధ్వర్యంలో జరగాలని చట్టం చెబుతుండగా కూటమి ప్రభుత్వం మాత్రం ఇందుకు విరుద్ధంగా వెండర్ల విధానం ద్వారా పనులు చేపట్టి దోపిడీకి తెరలేపనుంది. ఈ విధానానికి స్వస్తపలకాలని మండల సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంపిడిఒకు పలువురు సర్పంచులు వినతిని అందజేశారు. ఉపాధి హామీ పనులు చేపట్టిన వెండర్ (కాంట్రాక్టర్) ఎటువంటి లాభా పేక్ష లేకుండా పనులు చేస్తారా అని ప్రశ్నించారు. కూటమి నాయకులే ఇక్కడ వెండర్ల అవతారమెత్తి దోచుకోవడానికి తెరలేపారన్న అనుమానం ప్రజలకు కలుగుతుందన్నారు. సర్పంచుల హక్కులను కాలరాస్తూ వారిని నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలంగా శ్రీరాములునాయుడు, జడ్పిటిసి మామిడి బాబ్జీ, సర్పంచులు బుడితి శ్రీనివాసరావు, అల్లు తిరుపతరావు, అధికారి నారాయణరావు, బి.తిరుపతిరావు, దొగ్గ పద్మ, బి.ఉమామహేశ్వరరావు, బి తిరుపతిరావు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న సీతానగరం మండల సర్పంచులు

పార్వతీపురం రూరల్ : ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా వెండర్ల ద్వారా ఉపాధి హామీ పనుల బిల్లుల చెల్లింపును ఆపాలని ఎంపిపి మజ్జి శోభారాణి, మండల సర్పంచులు, ఎంపిటిసిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం ఇఒపిఆర్‌డి రమణమూర్తికి ఈ మేరకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామసభల తీర్మానంతోనే పథకం పనులు చేపట్టాలని, గ్రామ సభల్లో ఆమోదం పొందని పనులు కూడా తలపెడుతున్నారని, ఇది చట్ట విరుద్ధమని వెండర్ ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారని, అలా కాకుండా గ్రామ పంచాయతీల ద్వారా చెల్లింపులు చేయాలని, అలాగే గ్రామ, మండల, జిల్లా పరిషత్లలో ఆమోదం పొందిన తర్వాతనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంకూరు రవికుమార్ సిద్ధ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : ఉపాధి హామీ పనులు చట్టబద్ధంగా అమలు చేసి, టెండర్ల దోపిడీ విధానానికి స్వస్తి పలకాలని మండల సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంపిడిఒ విజయలక్ష్మికి ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వినతిని అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి అలజంగి రవికుమార్, ఎంపిపి నాగమణి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

నిష్పక్షపాతంగా సేవలు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -భామిని

ప్రజాప్రతినిధులు నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోట శాంతికుమారి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పంచాయతీల్లో చేపట్టే సిసి రోడ్డు పనులు శంకుస్థాపనకు ఎంపిడిఒ స్థానిక సర్పంచులకు తెలుపలేదని, పంచాయతీ తీర్మానం లేకుండా పంచాయతీ పనులు నిర్వహిస్తారా అని ఎంపిటిసి టింగ అన్నాజిరావు ప్రశ్నించారు. ఉపాధిహామీ పనులు మానిటరింగ్ చేయాల్సిన ఎంపిడిఒ బాధ్యత రహితంగా ఉండటమే ఇటువంటి పరిస్థితి కారణమని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా వున్నవారు, రాజకీయ కోణంలో కాకుండా అర్హత ప్రామాణికగా ప్రజలకు సేవలందించాలని, ప్రభుత్వ అధికారులు రాజకీయ వత్తిడికి తలొగ్గొద్దని, ప్రభుత్వం తప్పు చేస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని, మీకు వున్న నిబంధనలు మేరకు ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బోనగడ్డి ధర్మారావు, మజ్జి పాల్గుణరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాద్ రావు, ఎంపిడిఒ రామచంద్రరావు, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, కొవ్వాడ చిరంజీవులు, ఎంపిటిసి లు, సర్పంచ్ లు, అధికారులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పాడి రైతులు

పాల ధర తగ్గింపుపై నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

విశాఖ డెయిరీ యాజమాన్యం రైతుల నుంచి సేకరిస్తున్న లీటర్ల పాల ధర తగ్గింపునకు నిరసనగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి పాల రైతుల సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల రైతుల సంఘం అధ్యక్షులు బొంగు అప్పలనాయుడు, రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు మాట్లాడుతూ లీటరుకు పాలకు కనిష్టధరపై పది రూపాయలు అదనంగా చెల్లించాలని, లీటర్ పాలుకు ప్రోత్సాహక ధర ఎనిమిది రూపాయలు ఇవ్వాలని, పశువులన్నింటికీ ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని, పాడి పశువులకు రాయితీలు, రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు చేస్తున్న ఈ పోరాటానికి ప్రజాసంఘాలు, సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయన్నారు. ధర్నా అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్ నాయుడు, సుర్రు రామారావు, ఎం.రాంబాబు, లక్ష్మణ తదితరులు పాడి రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కృషి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సాలూరులో మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం మె ప్రారంభించి, మొదటగా తను శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించి ఆమె తీసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ టిడిపి సభ్యురాలినని సగర్వంగా చెప్పుకుంటానన్నారు. ఈ పార్టీ కార్యకర్తల కష్ట, సుఖాలను వారికి అన్ని విధాలా ఆదుకొనేలా ముందుకువెళ్తుందని తెలిపారు ప్రతి టిడిపి కార్యకర్త ఈనెల 26నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వాములు కావాలి పిలుపునిచ్చారు. నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతంగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజ్‌దేవ్, సాలూరు పట్టణ, రూరల్, మక్కువ, పాచిపెంట మండలాల అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆమదాల పరమేష్, పరామేష్, గుళ్ల వేణుగోపాల్, పిన్నింటి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ : మండలంలోని శివునిలో మండల టిడిపి అధ్యక్షులు ఎస్ శేఖర్ పాతుడు ఆధ్వర్యంలో టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపిని భవిష్యత్తులో మరింత బలోపేతం చేసేలా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి కార్యకర్త వంద రూపాయలు చొప్పున సభ్యత్వం తీసుకుంటే వారికి ఇన్సురెన్సు, ఇతర పార్టీ నుంచి వచ్చే రాయితీలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్రకార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, టిడిపి నాయకులు దత్తి లక్ష్మణరావు, జి.సుదర్శనరావు, మధుసూదనరావు, పి.వెంకటనాయుడు, కోల రంజిత్ కుమార్, కృష్ణ బాబు, పద్మావతి, మరిశర్ల సింహాచలం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూపుల వారీగా సభ్యత్వ నమోదు

పాలకొండ: టిడిపి సభ్యత్వాల నమోదు కార్యక్రమం గ్రూపుల మధ్య వేర్వేరుగానే జరిగింది. మొదటి నుండి పార్టీలో రెండు గ్రూపులు ఉండడం అందరికీ తెలిసిన విషయమే. సభ్యత్వాల నమోదు కార్యక్రమం శనివారం చేపట్టగా, ఇరు గ్రూపులు వేర్వేరుగానే సభ్యత్వాల నమోదు చేపట్టాయి. ఇందులో భాగంగా పట్టణంలోని పెద్దకాపు వీధి సెంటర్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ పడాల భూదేవి అక్కడున్న ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి, సభ్యత్వాల నమోదు సేకరించారు. ఆమెతో పాటు సీనియర్ నేత, మాజీ జెడ్పీటిసి సభ్యులు సామంతుల దామోదరరావు, కండాపు వెంకటరమణ, గుమ్మిడి సింహాద్రి, శాసపు సర్వారావు, వంజరాపు ఈశ్వర రావు, వావిలపల్లి రమణ, తదితరులు ఉన్నారు. బుట్టిమటం దగ్గర టిడిపి సీనియర్ నేత పల్లా కొండలరావు, పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు టీకాలు : డిఐఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు టీకాలు వేయాలని , మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) డాక్టర్ ఎం.నారాయణ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని రేగిడి, దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నెల్లికెక్కువ అంగన్వాడీ సెంటర్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకా అర్హులైన పిల్లలు, గర్భిణీల వివరాలు, గడువు తేదీలను, టీకా కార్డుల్లో పరిశీలించారు. వ్యాక్సిన్ కాల పరిమితి తనిఖీ చేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు సకాలంలో టీకా వేయడం జరిగిందా అని, ఎవరైనా డ్రాప్‌ఔట్స్/లెఫ్ట్ ఔట్స్ ఉంటే గుర్తించి టీకా పూర్తి చేయాలన్నారు. టీకాలు వేయడం పూర్తిన వెంటనే నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదల నమోదు రికార్డులు పరిశీలించారు. పిల్లలు పౌష్టికాహారం సరిగా తీసుకునేలా చూడాలన్నారు. అనంతరం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నెలా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ అనారోగ్య లక్షణాలతో ఉన్నవారిని గుర్తించి తగు చికిత్స అందించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గృహ సర్వేలు చేపడుతూ గర్భిణీ, బాలింతలు, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సూచించారు. వివరాలన్నీ ఇ-ఆశా యాప్ లో నమోదు చేయాలన్నారు. అలాగే రేగిడి జిటిడబ్ల్యుఎజిహెచ్ పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు వెంకట ప్రతాప్ కుమార్, ప్రవీణ్ కుమార్, సూపర్వైజర్ జయగౌడు, ఐసిడిఎస్ పిఒ సిహెచ్ సుశీల దేవి, రేగిడి జిటిడబ్ల్యుఎజిహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సుగుణ, వార్డెన్ జోగులత, దుడ్డుఖల్లు పిహెచ్సీ ఈఒ సత్యరాజ్, సూపర్వైజర్ పెంటమ్మ, లేబ్ టెక్నీషియన్ రాము, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సిక్‌రూంలో ఉన్న విద్యార్థులను పరీక్షిస్తున్న డిఐఒ నారాయణరావు

గ్రహణం మొర్రిపై వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం

పిల్లల్లో పుట్టుక లోపాలైన పెదవి, అంగటి చీలిక (గ్రహణం మొర్రి) సమస్య ఉన్నవారికి ఉచిత శస్త్ర చికిత్స కొరకు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డిఈఐసి)లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. స్మైల్ ట్రైన్ ఫౌండేషన్, విశాఖపట్నం వారి సౌజన్యంతో ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ విశాఖలో వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు అర్బిఎస్ కె జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.ఎల్ రఘుకుమార్, డిఇఐసి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్. భరత్ చంద్ర తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తుగా ఇచ్చిన సమాచారంతో జిల్లాలో పలు ప్రాంతాల నుండి వైద్య శిబిరానికి ఆయా సమస్యలున్న పిల్లలను వారి తల్లిదండ్రులు తీసుకొచ్చిరని, వీరికి వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేపట్టారని తెలిపారు. జిల్లాలో 13 మంది పిల్లలు పెదవి, అంగటి చీలిక సమస్యతో ఉండగా వీరిలో ఎనిమిది మందికి గతంలో ఆపరేషన్ చేయగా, వచ్చే నెల ఇతర పుట్టుక లోపాలున్న పిల్లలకు చికిత్స నిమిత్తం డిఇఐసిలో శిబిరాన్ని నిర్వహిస్తార న్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇటువంటి సమస్యలున్న పిల్లలను వైద్య సిబ్బంది త్వరగా గుర్తించడం వల్ల వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందజేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, డిఇఐసి వైద్యాధికారి ఎ. లలితదుర్గ, దంత వైద్యులు కె. సౌజన్య, స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎస్. మనీషా, ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీనారాయణ, చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయకుమార్, సోషల్ వర్కర్ అంజమ్మ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామరెల్లి ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సామరెల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎఎంఒ పి.కోటిబాబు శనివారం సందర్శించారు. ఎస్ఎ-2 పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, వంటగది, మెనూ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిపట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఎఎంఒతో పాటు ప్రధానోపాధ్యాయులు ఎ.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ఇరిగేషన్ డిఇఇగా గనిరాజు

ప్రజాశక్తి - పాలకొండ

ఇరిగేషన్ డిఇఇగా గనిరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన డిఇఇ దమలపాటి రవికుమార్ కురుపాంకు బదిలీ అయ్యారు.

పలు పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్

ప్రజాశక్తి - సీతంపేట

పోలీసుల అమరుల వారోత్సవాలు సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం పోలీస్ కమ్యూనికేషన్ డే సీతంపేట బాలికల ఆశ్రమ విద్యార్థులకు పోలీసు విధులు, ఎఫ్ఐఆర్ నమోదు గురించి అవగాహన కల్పించారు. తుపాకీ ఎలా ఉపయోగిస్తారు, వాటి వివిధ భాగాలపై, చట్టాలపై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై వై.అమ్మన్నారావు, ఎఎస్ఐ సంజీవ్, హెచ్‌సి గురుమూర్తి తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టేషన్ లో ఉండే ఆయుధాలు, ఇతర సామాగ్రిని చూపించి అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ యొక్క ఫంక్షనింగ్ దర్యాప్తు విధానం గూర్చి వివరించారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీసు చట్టాలపై ఎస్ఐ ఎం.రాజేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ దాలినాయుడు, ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని కురుపాం, నీలకంఠాపురం పోలీస్ స్టేషన్లలో ఎస్సైలు నారాయణరావు, నీలకంఠరావు విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలు, ఎదురయ్యే సవాళ్లు, సాంకేతిక పరిజ్ఞానం, అల్లర్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీసులు వాడే తుపాకులు, యంత్రాలు విద్యార్థులకు చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యంత్రాలను చూసి పరిశీలించడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : పోలీస్ చట్టాల ఎస్సై జి కళాధర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, ఖైదీలు ఉండే సెల్, పోలీస్ రిసెప్షన్,ఎఫ్ఐఆర్ నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కష్ణం నాయుడు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ,పాల్గొన్నారు.



కురుపాం : ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

డిఇఒ నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్‌టి నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు బాధ్యతలు నిర్వహించిన జి.పగడాలమ్మ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్ ఎన్ టి నాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా విద్యాశాఖాధికారిగా నియమించారు.

డిఇఒను కలిసిన ఎంఇఒలు

పార్వతీపురం టౌన్ : డిఇఒగా బాధ్యతలు స్వీకరించిన ఎం తిరుపతి నాయుడిని ఎంఇఒ 1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఆధ్వర్యంలో జిల్లాలో గల ఎంఇఒఓలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఇఒను నిదుశ్శాలువ తో సత్కరించి, పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగత శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ మన్యం జిల్లాను విద్యారంగంలో ప్రగతి పథంలో నడిపించేందుకు ఎంఇఒలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒలు పద్రి కృష్ణ మూర్తి, రాజ్ కుమార్ ఎన్. తిరుపతి నాయుడు ల తో పాటు జిల్లాలో గల ఎంఇఒలు పాల్గొన్నారు.

భవిష్యత్తును చక్కదిద్దుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఆర్ఐటిఐలో చదివి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలని సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు అన్నారు. భద్రగిరి ఆర్ ఐటిఐలో చదువు పూర్తయిన విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతి విద్యార్థి తను అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి ఉద్యోగాల్లో స్థిరపడి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని కోరారు. 149 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు నాశనం


ప్రజాశక్తి - కురుపాం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని ఎస్సై పి. నారాయణరావు అన్నారు . శనివారం కురుపాం మేజర్ పంచాయతీ కురుపాం పరిధిలో గల మేజర్ పంచాయతీ పరిధిలో గల పెళ్లివలసలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వ్యసనాలకు బానిసైతే వారి భవిష్యత్తు నాశనం అవుతుందని కావున యువత సక్రమార్గంగా ఉండాలని అన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత మహిళలు పాల్గొన్నారు.

దేవాలయాల పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి -వీరఘట్టం

దేవాలయాల పాలకమండలిలో సభ్యులుగా అవకాశం కల్పించినందుకు అరకు పార్లమెంటు నాయి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ దాళ్లవలస శ్రీను నాయి బ్రాహ్మణుల తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞత తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులను అన్ని దేవాలయాల్లో పాలకమండల సభ్యులుగా అవకాశం కల్పించేలా క్యాబినెట్ మీటింగ్లో తీర్మానం చేయడం మంచి శుభ పరిణామని అన్నారు. అలాగే కనీస వేతనం రూ 25 వేలు ప్రకటించినందున హర్షం వ్యక్తం చేశారు. షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామ న్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కనీస వేతన ఏడాదికి రూ.పదివేలు ఇచ్చిందని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు కూటమి ప్రభుత్వానికి నాయి బ్రాహ్మణులు రుణపడి ఉంటారని ఆయన అన్నారు



మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలుపుతున్న శ్రీను